కథ

నేను రాజమండ్రి రెల్వేస్టేషనుకు చేరేసరికి టైము ఉదయం తొమ్మిది.
కౌంటర్‌లో టిక్కెట్టు తీసుకొని, 'ఎంక్వయిరీ'లో
'జన్మభూమి' ఎప్పుడొస్తుందని అడిగాను.
''తొమ్మిదిన్నర'' అంది కౌంటర్‌లో అమ్మాయి.
చేసేదేంలేక జనరల్ వెయిటింగ్ హాల్లో కూర్చున్నాను.
నాపక్కసీటులో ఓ 'సీనియర్ సిటిజన్' (సీసి). నన్నుచూసీ చూడనట్లు చూశాడాయన. ఆ వయసులోనూ ఆయన ముఖంలో ఏదో ఆకర్షణ, కళ్ళల్లో మెరుపు కొట్టొచ్చినట్లు కన్పడుతున్నాయి.

# శ్రీరామరక్ష

## పినిశెట్టి శ్రీనివాసరావు

ఆకాశం మబ్బుల్తో కమ్మేసినా... గాలి స్తంభించి, ఉక్కపోతగావుంది. పైనున్న సీలింగ్ ఫేన్ వంక ఒకసారిచూసి, సీసిగారితో ''ఫేను వేసుకుంటే మీకేమైనా అభ్యంతరమా?'' అని అడిగాను.

''అబ్బే...నాకేం అభ్యంతరం?'' అన్నాడు ఆయన.

వెంటనే లేచి, ప్రక్కనున్న ఫేను స్విచ్ ఆన్‌చేశాను.

ఫేన్‌గాలికి వొంటికి పట్టిన చెమట ఆరి, హాయిగా అనిపించింది.

ఇంతలో ప్రక్కనున్న 'సీసి'గారు... ''మీరు కనుక, ఫేను వేసుకోవచ్చా...అని అడిగారు. మరొక రైతే, నా ఇష్టాయిష్టాలతో ప్రమేయమేంటన్నట్లు...'' అంటుండగానే, ఆయన మాటకు అడ్డొచ్చి, ''అబ్బే ... మీరు పెద్దవారు... ఈ వయసులో, ఈమబ్బు వాతావణంలో... ఫేనుగాలిపడక మీరు ఇబ్బంది పడ్డారనుకోండి.. అందుకని అడిగాను'' అన్నాను.

''చాలా థాంక్స్... ఈరోజుల్లో పెద్దవయసు వాళ్ళను గౌరవించే మీలాంటివాళ్ళు తక్కువ మంది ... మీరు ఏవూరు వెళ్తున్నారు?'' అని అడిగారు.

''బెజవాడ... మరి మీరో?'' అన్నాను.

''సికింద్రాబాదు..మా అమ్మాయి-అల్లుడు-మనవల్నీ చూసొద్దామని. ..ఉద్యోగాలు చేసే వాళ్ళకు రావటం ఎలాగూ వీలుకాదూ...'' అన్నారు.


''ఈవయసులో, ఇలా ఒంటరిగా... రిజర్వేషను చేయించుకున్నారా...ఏమైనా అర్జంటు పనా?'' అని అడిగాను.

''రిజర్వేషను అక్కర్లేదు...సీటుదొరుకుతుంది. పగలు ట్రైన్‌కదా! అర్జంటంటూ ఏంలేదు...తరచూ వెళ్తుంటాను..పిల్లల్ని చూసిరావటానికి. మనవలు తింటానికి, సున్నుండలు, కజ్జికాయలు, చక్రాలు, ఇంకా ఇంట్లోకి కారం-చింతపండు వగైరా వగైరా తీసుకెళ్లున్నాను. స్టేషనుకు అల్లుడొస్తాడు.. కష్టమేం లేదు.'' అన్నారాయన.

నాకేం మాట్లాడాలో తెలియలేదు. ఆయన ముఖంలోకి తేరిపాక చూస్తుంటే..ఆయనే చెప్పుకొచ్చారు...గవర్నమెంట్ ఉద్యోగంచేసి, రిటైరై పదిహేను సంవత్సరాల పైనే అయ్యిందట. జగ్గంపేట దగ్గర ఓ చిన్నగ్రామం. సొంతింట్లోనే నివాసం-. ఇద్దరు కొడుకులు-ఒక కూతురు. అందరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. ఉద్యోగ నిమిత్తం తలా ఒకదారి పట్టారు. ఆయన మాత్రం భార్యతో కలిసి తన సొంతింట్లోనే... ఆ చిన్న గ్రామంలో ఉంటున్నారట. పెద్దగా ఆస్తుపాస్తుల్లేవట. పెన్షన్ డబ్బుల్తోనే అడ్జస్టు అయిపోతున్నారట. తన ఇంటి ఆవరణలోనే రాములవారికి ఓ చిన్నగుడి కూడా కట్టించారట. తనే ఆ గుడిని రోజూ శుభ్రంచేసి, దేవుడికి దీపంపెట్టి, ఓబెల్లంముక్క, పండు నైవేద్యం పెట్టి, పెరట్లో పూలుకోసి-మాలకట్టి, రాములవారి విగ్రహానికి వేయటం ఆయన దినచర్యట. సర్వీసులో ఉన్నప్పుడు ఆయన ఎవ్వరిదగ్గర చేయిచాచి యాచించి యెరుగడట. ఎవ్వరైనా సంతోషంగా ఏదైనా ఇస్తే తీసుకునేవాడట...'' ఇలా తన గురించి, నేనేమీ అడక్కుండానే చెప్పుకొచ్చారు.

ఆయన చెప్పిందాన్నిబట్టి... సుమారుగా ఆయనకు డైబ్భైఐదు సంవత్సరాల వయసుండొచ్చని లెక్కకట్టాను. నిన్నగాక మొన్న రిటైరైన నేను... రిజర్వేషనులేకుండా, రైలు ప్రయాణం చెయ్యాలంటే, ముందు-వెనుక ఆలోచిస్తాను. మరి ఈయన ఏడుపదుల పైబడిన వయస్సులో... ఏ రిజ్వషన్ లేకుండా, సునాయసంగా తిరిగేస్తున్నాడంటే... పిల్లలమీద మమకారం...ప్రేమ, బహుశా ఆయనకు ఆ మనోధైర్యాన్ని ఇచ్చాయనుకుంటాను. మరి...పిల్లలకు కూడా వృద్ధులైన తల్లిదండ్రులమీద ప్రేమానురాగాలు వుంటే ఆ తల్లిదండ్రులు ఎంత అదృష్టవంతులు.

టైము తొమ్మిదిన్నర దాటింది. ట్రైను ఇంకా రాలేదు. ఇద్దరం..నేటి భ్రష్టుపట్టిన రాజకీయాలు, పెరుగుతున్న ధరలు-తరుగుతున్న నైతిక విలువలు... మానవసంబంధాల గురించి పిచ్చాపాటీ మాట్లాడుకున్నాం.



పదిదాటాక, ట్రైనొచ్చింది. వెయిటింగ్‌రూం ఎదురుగా ఆగిన బోగీ దగ్గరకు నడుచుకుంటూ వెళ్ళాం. రెండుచేతుల్లో రెండు బ్యాగులు పట్టుకుని సీసిగారు, జనాన్ని తోసుకుంటూ, కంపార్టుమెంటులోకి ఎక్కేశారు. నేను, చేతిలో బ్రీఫ్‌కేస్‌తో, కష్టపడి రైలెక్కాను. పావుగంటసేపు మా ఇద్దరికీ సీట్లు దొరకలేదు. నుంచేనే వున్నాం. ఆతర్వాత... ఆయనకొకచోట, నాకొకచోట, సీట్లుదొరికితే, వెళ్ళికూర్చున్నాం.

విజయవాడ వెళ్ళేలోపు, నాకు నాలుగైదు సార్లు కునుకు పట్టేసింది. మెలకువ వచ్చినప్పుడల్లా, వెనక్కుతిరిగి ఆయన సీటు వంక చూసే వాడిని. ఆయన నిటారుగా కూర్చుని, అటూ- ఇటూ చూస్తున్నారు తప్ప... నిద్రపోతున్న ఛాయలేం కన్పడలేదు ఆయనలో. సీసిగారు అసాధ్యుడే అనుకున్నాను.

విజయవాడ స్టేషను వస్తుందనగా... లేచివెళ్ళి ఆయన ప్రక్కసీటు ఖాళీ అయితే..కూర్చున్నాను.

ఆయన నాచేతిని తనచేత్తోపట్టుకుని, ''మీకొక్క విషయం చెప్పాలి..మీరు రిటైరైయ్యారన్నారుగా...ఇక ఏ బాదరబందీలు పెట్టుకోకుండా మీకు నచ్చినట్లుగా ప్రశాంత జీవితం గడపండి. పిల్లల దగ్గరకు చుట్టంచూపులా అప్పుడప్పుడు వెళ్ళి రావొచ్చు... కాని, మనస్థావరాన్ని వదిలి పర్మినెంటుగా వాళ్ళతోనే వుండి పోదామనుకోవటం శ్రేయస్కరం కాదు. దూరంగా వుంటూ ఒకరి క్షేమసమాచారాలు ఒకరు తెలుసుకుంటూ వుంటేచాలు. అప్పుడే మన వయస్సుకు-హోదాకు తగ్గ గౌరవం-మర్యాద లభిస్తాయి. మన అలవాట్లు-అభిప్రాయలు నెక్స్ట్ జనరేషన్‌కు నచ్చవు. అదివాళ్ళతప్పుకాదు. మారుతున్న కాలంతోపాటు వాళ్ళలోనూ మార్పురావటం సహజం. అందుకనే ఎవ్వరి స్థానాల్లో వాళ్ళుంటే ఒకరికోసం ఒకరు మారవలసిన అవసరంరాదు... రెండో విషయం.. మీరు నిలవేసుకున్న డబ్బులు-ఇల్లు- ఇతర ఆస్తిపాస్తులు వగైరా... పిల్లలకు అప్పుడే మొత్తం పంచి పెట్టేయకండి. మీకంటూ, మీ అవసరాల మేరకు ఉంచుకోండి. ఈవయసులో ఆరోగ్య సమస్యలు వస్తుంటాయి. మంచాన పడితే డాక్టర్లుకు-మందులకు-పనోళ్ళకు బోల్డు డబ్బులు పోయాలి. వాటికోసం పిల్లలముందు చేయి చాపకూడదు. మన దగ్గర డబ్బుంటే అదే మనకు శ్రీరామరక్ష... అనుభవం మీద చెప్తున్నాను......ట్రైను ఆగినట్లుంది...దిగండి'', అంటూ నాచేతిని వదిలేసి, అర్జునుడికి గీతోపదేశం చేసిన కృష్ణపరమాత్మలా ఓ లుక్ ఇచ్చారు.

ట్రైను దిగి, ప్లాట్‌ఫారం మీద నడుస్తున్ననాకు 'సీసి'గారు నాకెందుకీ ఉపదేశం చేశారా అని ఆలోచిస్తే... బహుశా రాజమండ్రి స్టేషనులో- వెయిటింగ్‌రూంలో ఫేన్ వేసుకోవటానికి- సీసిగారి పర్మిషన్ అడిగిన నేను... ఆయన కంటికి... ఓ ఆత్మీయుడిగా కన్పించేనేమో !

★